క్లుప్తంగా

సహస్ర పుష్పార్చన



గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం నాల్గో శనివారం సందర్భంగా స్వామి వారికి చామంతి పూలతో సహస్ర పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, అర్చకులు కాందూరి రామాచార్యులు, విష్ణు, ఫణీంద్ర, పంచాయతీ కార్యదర్శి శంకర్‌రావు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వీరాటి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు



నర్సంపేట : మాధన్నపేట పెద్ద కాల్వకు వివకానంద కాలనీ వద్ద గండి పడి ఇళ్లలోకి వరద నీరు చేరుతుండడంతో కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జ్ దేవండ్ల రాంబాబు సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే సిబ్బంది స్పందించారు. జేసీబీ సాయంతో కాల్వలోని చెత్తాచెదారం, గుర్రపుడెక్క తొలగించారు. దీంతో నీటి ప్రవాహం సజావుగా సాగింది. కార్యక్రమంలో నాయకులు దూసరి కరుణాకర్, పున్నం రాజు, కిశోర్, ఆవుల శ్రీకాంత్, దూసరి రవీందర్, భానోతు సాయికుమార్, హన్మకొండ రాజా, కొలువుల వెంకట్, మహేందర్, బోళ్ల అశోక్, బల్ల కుమార్, లక్క రాజు తదితరులు పాల్గొన్నారు.

కలుషిత తాగునీరే దిక్కు..!



పర్వతగిరి : మండల కేంద్రంలోని చౌరస్తా పరిసర ప్రాంతాల ప్రజలకు కొద్ది రోజులుగా కలుషిత తాగునీరు దిక్కుగా మారింది. గతంలో సీసీ సింగిల్ రోడ్డు ఉన్న క్రమంలో పాత పైపులైన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పైపులైన్ వేసిన క్రమంలో పాత పైపులైన్‌కే కనెక్షన్ ఇవ్వడం, అనంతరం డబుల్ రోడ్డు వేయడంతో పైపులైన్ లీకేజీ ఏర్పడింది. గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోతుండడంతో ప్రజలకు కలుషిత నీరు సరఫరా అవుతోంది. అధికారులు స్పందించి వెంటనే సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నర్సంపేట : పట్టణంలోని పదో వార్డుకు చెందిన సకినాల కావ్యజ్యోతికి, పులిచేరు రఘువర్మకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తుమ్మలపల్లి సందీప్, వార్డు కమిటీ ఇన్‌చార్జ్ మోటం రవి శనివారం పంపిణీ చేశారు. అలాగే 1వ డివిజన్‌కు చెందిన పల్లకొండ శంకరయ్యకు మంజూరైన చెక్కును పార్టీ డివిజన్ ఇన్‌చార్జ్ లక్కర్సు రమేశ్ అందజేశారు.

రోడ్డు ప్రమాదం

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాలలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలయ్యాయి. వివరాలిలా.. గ్రామానికి చెందిన రాజు పొలంలో నాటు వేసుకుంటున్న క్రమంలో ఎడ్లబండిలో వరినారు తీసుకుని పొలం వద్దకు వెళ్తుండగా వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారిపై కట్ర్యాల శివారులో ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన పాల వ్యాను ఢీకొట్టింది. రాజుకు, ఎద్దుకు గాయాలయ్యాయి. ఎద్దు పరిస్థితి విషమంగా ఉందని పశు వైద్యులు తెలిపారు.

పరామర్శ

రాయపర్తి: మండలంలోని పెర్కవేడుకు చెందిన గాదె ఆంజనేయులు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు శనివారం పరామర్శించారు. ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సమకూర్చిన బియ్యం, ఆయిల్ క్యాన్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి పూస మధు, ప్రసాద్, సంకినేని ఎల్లస్వామి, చిన్నాల రాజబాబు, బండి రాజబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకన్న, సమ్మయ్య, నిమ్మల మధు తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో బాలబాలికలు



గోపికలా బాలిక



జయదేవ్, ఆద్య



మహ్మద్ అలైన



ఊరూరా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, చెన్నారావుపేట, దుగ్గొండి, నల్లబెల్లి, గీసుకొండ, వర్ధన్నపేట, తదితర మండలాల్లో ఊరూరా శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో, ప్రధాన కూడళ్లలో, ఆలయాల వద్ద శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమానికి యువకులు పోటీ పడ్డారు. పలు ఆలయాల్లో అర్చకులు తెల్లవారుజాము నుంచి రాత్రి 9 గంటల వరకు గీత పారాయణం, భజనలు, తదితర పూజా



దుగ్గొండి : గోమాతకు పూజ చేస్తున్న భక్తులు

కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులతో శ్రీకృష్ణ మందిరాలు కిటకిటలాడాయి. చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన ముస్లిం మతానికి చెందిన చిన్నారి మహ్మద్ అబ్దుల్ అలైన



వర్ధన్నపేట: పూజ చేస్తున్న ఎస్సై చందర్, భక్తులు

గోపిక వేషధారణలో అందరినీ ఆకట్టుకుని ప్రత్యేకత చాటుకుంది.

నాటి నిధులతో అభివృద్ధి చేయండి



మత్తడి నీటిలో పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం : గత బీఆర్‌ఎస్ హయాంలో మంజూరు చేసిన నిధులతో నర్సంపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. మండలంలోని పాకాల మత్తడి, కట్ట మైసమ్మ వద్ద శనివారం ఆయన ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాల కబ్జాలు, అవినీతి, అక్రమాలు భారీగా పెరిగిపోయాయని తెలిపారు. ఎమ్మెల్యే మాధవరెడ్డికి అవసరమైన పనులకే టెండర్లు వేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. మిగతా వాటిపై కనీసం సమీక్షించడం లేదన్నారు. గతంలో మంజూరు చేయించిన రూ.500 కోట్లు ఉన్నాయని, అవి వెనక్కి మళ్లకుండా అభివృద్ధి పనులకు వినియోగించాలని సూచించారు. కాంగ్రెస్ కార్యకర్తలతో పనులు చేయించినా తాము అడ్డుకోమని తెలిపారు. నిధులు వెనక్కి వెళ్తే మాత్రమే ప్రజలే తగిన రీతిలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కొండవీటి ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

● బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇస్తామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని పత్తినాయక్‌తండా గ్రామ 210వ బూత్ కమిటీఅధ్యక్షుడు భానోతు వెంకన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో పని చేసిన భానోత్ రవీందర్, భానోత్ గద్దర్, భానోతు తిరుపతి, శ్రీనివాస్, బీఆర్‌ఎస్‌కు చెందిన భానోతు వినోద్, ధరావత్ గణేశ్, భానోతు వినోద్ శనివారం బీజేపీలో చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పలువురు బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ దుంకదువ్వ రంజిత్, సీనియర్ నాయకుడు వనపర్తి మల్లయ్య, ప్రధాన కార్యదర్శులు మురహరి విజయ్, కీసరి సాంబరాజు, జిల్లా బీజేవైఎం కార్యదర్శి ఎర్ర రాజు, ఉపాధ్యక్షులు కందాల చంద్రమౌళి, భూక్య లచ్చనాయక్, సదర్‌లాల్, కాటి హరీశ్, పడిదం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘సఖి’ సేవలపై అవగాహన అవసరం

● కౌన్సిలర్ శోభారాణి, కేస్ వర్కర్ స్వప్న

గీసుకొండ : సఖీ కేంద్రాల్లో లభించే సేవలపై మహిళలకు, బాలికలకు అవగాహన అవసరమని లీగల్ కౌన్సిలర్ శోభారాణి, కేస్ వర్కర్ స్వప్న తెలిపారు. మండలంలోని వంచనగిరిలో గ్రామైఖ్య సంఘాల సభ్యులకు శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళలు హక్కులు, చట్టాలపై చైతన్యవంతం కావాలని ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తున్న సఖి కేంద్రాల్లో బాధిత మహిళలకు, బాలికలకు, వృద్ధులకు సేవలు ఉచితంగా లభిస్తాయని చెప్పారు. సమస్యలతో బాధపడుతున్న మహిళలు, బాలికలు, వృద్ధులు సఖి కేంద్రాల్లో లభించే సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేసి సాయం పొందాలని చెప్పారు. గృహ హింస, బాల్య వివాహాల నిరోధక పోక్సో లాంటి చట్టాలపై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న శోభారాణి, స్వప్న

కాంగ్రెస్ హయాంలోనే పేదల అభివృద్ధి



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న హరిబాబు, జగన్‌మోహన్‌రెడ్డి

● మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హరిబాబు

ఖానాపురం : కాంగ్రెస్ హయాంలోనే పేదలు అభివృద్ధి చెందుతారని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యద్ల జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మనుబోతులగడ్డకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు శనివారం కాంగ్రెస్‌లో చేరగా వారికి హరిబాబు, జగన్‌మోహన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం హరిబాబు, జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో అన్ని వర్గాల ప్రజలూ ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ఒక్కిరికి కూడా రేషన్‌కార్డు ఇవ్వలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలనూ దశలవారీగా పారదర్శకంగా అమలు చేస్తోందని చెప్పారు. ఈ క్రమంలో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరికలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ ముస్తఫా, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు షేక్ కమ్రుద్దీన్, నాయకులు లింగిడి వెంకటేశ్వర్లు, చెడిపాక ఉపేందర్, పూల్య, యాకూబ్ పాషా, గంగయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

● ఏఐయూకేఎస్ ప్రధాన కార్యదర్శి సూరి

నర్సంపేట : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి కోరారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం సందర్భంగా మహాసభల కరపత్రాలను నాయకులతో కలిసి సూరి ఆవిష్కరించారు. అనంతరం సూరి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. రైతులకు సరిపడా యూరియా, ఎరువులు సకాలంలో అందించకుండా మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రైతుల ప్రయోజనాలు,



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సూరి, నాయకులు

సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు. రైతుల సమస్యలను మహాసభలో చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అర్షం సుధాకర్, ఉపాధ్యక్షుడు మైదం పాణి, సహాయ కార్యదర్శి గట్టి కొప్పుల రవి, కోశాధికారి లింగన్న, జిల్లా కమిటీ సభ్యుడు బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం.. వ్యాధులతో ముప్పు

● రక్షిత చర్యలు ముమ్మరం

నెక్కొండ : వానాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులతో ముప్పు తెలిసిందే. కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో ఈగలు, దోమలు వృద్ధి చెంది మండలానికి చెందిన పలువురు జ్వరాల బారిన పడుతున్నారు. నీరు కలుషితమవుతుండడమూ రోగాలకు ఊతమిస్తోంది. ఈ క్రమంలో అధికారులు ప్రజలను వ్యాధుల బారి నుంచి కాపాడే దిశగా రక్షిత చర్యలు ముమ్మరం చేశారు. అవగాహనా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, గ్రామాల్లో అధికారుల సందర్శన కొనసాగుతున్నాయి. డీపీఓ కల్పన, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల డీపీఓ కల్పన తోపనపల్లిలో పారిశుద్ధ్య పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అధికారులు మూడు తండా, ఇతర దాదాపు అన్ని గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నారు. సూరిపల్లి, ఇతర గ్రామాల్లో నీటి నిల్వలను తొలగింపజేస్తున్నారు.

విషజ్వరంతో చిన్నారి మృతి

మండలంలోని గుండ్రపల్లికి చెందిన ఐదేళ్ల చిన్నారి మొహ్రీన్ ఇటీవల విషజ్వరంతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీర్ఘకాలిక రోగాలతోనూ పలువురు మృతి చెందినట్లు తెలుస్తోంది. వర్షాల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిన దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో డెంగీ, మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యా, తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. చిన్నారి మృతి నేపథ్యంలో గ్రామంలో వైద్యాధికారులు శిబిరం ఏర్పాటు చేసి ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాల్సిన అవసరం ఉంది. వానాకాలం కొత్తనీరు వచ్చి చెరువులు, కుంటల్లో కలిసి నీరు రంగు మారడంతోపాటు కలుషితమయ్యే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో కాచి చల్లార్చిన లేదా క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలని అధికారులు సూచిస్తున్నారు. ఇళ్ల ఆవరణల్లోని పాత టైర్లు, కొబ్బరిబోండాలు వంటివి తొలగించాలని, నీటినిల్వలు పారబోయాలని అవగాహన కల్పిస్తున్నారు. సాయంత్రం 6 గంటల లోపు ఇంటి తలుపులు, కిటికీలు మూసేసి దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు.



తండాలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికుడు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ కల్పన

డ్రై డే నిర్వహిస్తున్నాం



వానాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న క్రమంలో వారంలో రెండ్రోజులు డ్రై డే నిర్వహిస్తున్నాం. సైడ్ డ్రెయిన్లలో మురుగు తీయిస్తున్నాం. గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పనులు కొంతవెనకపడినప్పటికీ వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించే ఏర్పాట్లు చేస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం.

- ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ



రోడ్డుపై నిలిచిన నీటిని తొలగిస్తున్న కార్మికుడు

‘మాజీ సర్పంచ్ ఆరోపణలు సరికాదు’

సంగెం : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మాజీ సర్పంచ్ గుండేటి బాబు చేసిన ఆరోపణ సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రమేశ్ విలేకరులతో మాట్లాడారు. దళితుడైనందునే జెండా ఆవిష్కరణకు తనను ఆహ్వానించలేదని బాబు వ్యాఖ్యలు చేయడంలో అర్థం లేదన్నారు. జెండా ఆవిష్కరణకు తహసీల్, మండల పరిషత్ కార్యాలయాలకు ఎవరినీ ఆహ్వానించలేదన్నారు. జెండాపై గౌరవంతోనే అందరూ వెళ్లినట్లు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడిపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సమావేశంలో ఊకల్ సొసైటీ చైర్మన్ బొమ్మల రమేశ్, నాయకులు గుండేటి రాజ్‌కుమార్, కొడగాని సారంగం, శ్రీనివాస్, వెంకన్న, రవి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం అన్నదాత అగచాట్లు



వర్షంలో గొడుగులతో బారులుదీరిన రైతులు

ఖానాపురం : యూరియా కోసం అన్నదాతకు అగచాట్లు తప్పడం లేదు. పంట సాగుకు అవసరమైన మేరకు యూరియా లభించకపోవడంతో సొసైటీలకు ఎప్పుడు యూరియా వచ్చినా రైతులు వందలాదిగా చేరుకుని క్యూ కడుతున్న పరిస్థితి నెలకొంటోంది. మండలంలోని బుధరావుపేట శివారు రామలింగయ్యపల్లికి 888 యూరియా బస్తాలు రాగా శనివారం ఉదయం వందలాదిగా రైతులు క్యూ కట్టారు. భారీ వర్షంలోనూ గొడుగు పట్టుకుని లైన్‌లో నిల్చొనా ఎట్టకేలకు పలువురు రైతులకు 2 చొప్పున యూరియా బస్తాలు అందాయి. పలువురు యూరియా బస్తాలు అందక ఖాళీ చేతులతో వెనుదిరిగారు. ఇకనైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండల రైతుల అవసరాలకు సరిపడా యూరియా వెంటనే అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నివాళి



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన మల్లెపాక ఉప్పలయ్య, సట్ల నర్సయ్య అనారోగ్య కారణాలతో శుక్రవారం మృతి చెందగా వారి మృతదేహాలకు స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పింఛన్ పెంపునకు ఉద్యమాలు తప్పవు

● ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

దుగ్గొండి : వృద్ధుల, వితంతువుల, వికలాంగుల పింఛన్ పెంపునకు ఉద్యమాలు తప్పవని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్ పెంచుతామంటూ కాంగ్రెస్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి సుమారు రెండేళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. పింఛన్ పెంపు కోసం దశలవారీగా ఉద్యమాలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈనెల 28న గీసుగొండలో నిర్వహించనున్న పెన్షనర్ల సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కొలగాని రవి, ఇనుముల పూర్ణయ్య, చింతం సిద్ధు, కొల్కనూరి నిరంజన్, పర్లపెల్లి బాబు, సరోజన, రమ, సుగుణ, స్వరూప, సాంబయ్య, మల్లయ్య, కట్టయ్య, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

రాయపర్తి : ఈనెల 28న వర్ధన్నపేటలో నిర్వహించనున్న సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌చార్జ్‌లు మాసాని గోపాల్, జిల్లా ధర్మయ్య మండలంలోని బంధనపల్లిలో శనివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. సదస్సుకు వృద్ధులు, వికలాంగులు, వితంతువులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు వశపాక కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బర్ల సిద్దార్థ, నాయకులు డెక్క అఖిల్, ఇల్లందుల అరవింద్, బర్ల శ్రీకాంత్, డెక్క శ్రవణ్, మంద నాగేంద్రబాబు, ఇల్లందుల రమేశ్, డెక్క అశోక్, డెక్క కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంరక్షణ కేంద్రానికి బాలుర అప్పగింత

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం-2పై ఉన్న ఇద్దరు బాలురను జీఆర్పీ పోలీసులు హనుమకొండ చైల్డ్ వెల్ఫేర్ సంస్థ ప్రతినిధి సుష్మకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ సురేందర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నెక్కొండ చెందిన శివునతూరి రూదాస్, సుభాస్ రూదాస్ తండ్రి వెస్ట్ బెంగాల్‌కు ఇటీవల వెళ్లగా వారు కూడా వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దీంతో బాలురను సంరక్షణ కేంద్రానికి అప్పగించారు. జీఆర్పీ కానిస్టేబుల్ నాగరాజు, విక్రమ్ పాల్గొన్నారు.



బాలురను చైల్డ్ వెల్ఫేర్ సంస్థకు అప్పగిస్తున్న జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సురేందర్